గురువారం 12-09-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 453 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




111 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

మిగతా 2లో




జూదంలో భార్యను, పిల్లలను తాకట్టు పెట్టిన భర్త

మిగతా 2లో



నాణ్యతకు భరోసా బ్రాండెడ్ టీ ప్యాకేజీలు

మిగతా 4లో



అమెరికా నేపథ్య కథ

మిగతా 5లో

## మేము ఉన్నంతకాలం రిజర్వేషన్లు రద్దు కావు

### దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడం రాహుల్‌కు అలవాటే

### రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అమిత్‌షా స్పందన





**ముందడుగు జాతీయం:**

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై దేశంలో తీవ్ర దుమారం చెలరేగుతోంది. దేశంలో రిజర్వేషన్‌లు, తదితర అంశాలపై అమెరికాలో రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాంతో రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు. విదేశాల్లో భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అమెరికాలో మన దేశాన్ని కించపర్చే వ్యాఖ్యలు చేసిన రాహుల్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ క్రమంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అమిత్ షా స్పందించారు. దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడం, దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు అండగా నిలవడం రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీ నేతలకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాహుల్ గాంధీకి తాను ఒక విషయం స్పష్టం చేయాలని అనుకుంటున్నానని, బీజేపీ ఉన్నంతకాలం దేశంలో రిజర్వేషన్లను ఎవరూ రద్దు చేయలేరని అన్నారు. అదేవిధంగా దేశ భద్రతతో ఎవరూ ఆటలాడలేరని అమిత్ షా హెచ్చరించారు. రాహుల్ గాంధీ ప్రతిసారీ దేశ భద్రతను ముప్పులో పడేస్తున్నారని ఆరోపించారు. ఆయన దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు. ప్రాంతీయ వాదం, మతం, భాష పరంగా చీలికలు తెచ్చే కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను రాహుల్ గాంధీ ప్రకటన మరోసారి బయట పెట్టిందని అమిత్ షా వ్యాఖ్యానించారు.



## 20 సీట్లు వచ్చి ఉంటే వారు జైల్లో ఉండేవారు

### బిజెపిపై మల్లికార్జున ఖర్గే విమర్శలు

**ముందడుగు జాతీయం:**

తమ కూటమికి ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మరో **20** సీట్లు వచ్చి ఉంటే వారంతా జైల్లో ఉండేవారు.. అంటూ బుధవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బిజెపిపై విమర్శలు చేశారు. దానిపై కమలం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమర్జెన్సీ ఆలోచనా ధోరణి అంటూ మండిపడింది. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఖర్గే మాట్లాడుతూ.."**400** అంటూ ప్రచారం చేసిన వారు ఎక్కడికి వెళ్లారు..? వారి సీట్లు **240**కి పడిపోయాయి. మాకు మరో **20** సీట్లు వచ్చి ఉంటే..వారంతా జైలుకు వెళ్లేవారు. వారు జైలుకెళ్లడానికి అర్హులు" అని ఖర్గే మాట్లాడారు. అయితే ఆయన ఎవరి పేర్లను ప్రస్తావించలేదు. కొద్దినెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి స్థానాలు **240**కి పరిమితం కావడం తెలిసిందే. ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి తీవ్రంగా స్పందించింది.

మిగతా 2లో

## తెలుగు రాష్ట్రాల్లో వరదనష్టంపై నివేదిక

### అమిత్ షాకు రిపోర్టు అందజేసిన చౌహాన్

**ముందడుగు జాతీయం:**

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు ఏపీ, తెలంగాణలోని వరదల కారణంగా అనేక ప్రాంతాలు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలుగురాష్ట్రాల్లో పర్యటించి వరద నష్టంపై ప్రాథమిక నివేదిక రూపొందించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాని కలిసి ఆ నివేదికను అందజేశారు. ఈ మేరకు శివరాజ్‌సింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. త్వరలోనే కేంద్ర బృందాలు వరద ప్రాంతాలను పరిశీలిస్తాయని, కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు.



ముందడుగు
గురువారం, 12-09-2024, హైదరాబాద్

# సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

## తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 17 "తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం"గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోజున రాష్ట్రవ్యాప్తంగా జాతీయ జెండాను ఆవిష్కరించాలని పేర్కొంది. నైజాం రాష్ట్ర ప్రజలకు 1949, సెప్టెంబర్ 17న నిజాం అరాచక పాలన నుంచి ఆనాటి నెహ్రూ ప్రభుత్వం సైనిక చర్య ద్వారా విముక్తి కలిగించిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా సెప్టెంబర్ 17 మీద వివాదాలు నెలకొంటున్నాయి. నైజాం ప్రజలకు విముక్తి కలిగిన రోజును ఎలా సెలెబ్రేట్ చేసుకోవాలో ఒక ఖచ్చితమైన పేరేమీ లేదు దీంతో ఎవరికి నచ్చింది వారు చేస్తూ వచ్చారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో గత కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ సెప్టెంబర్ 17పై కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 17ను "తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం" పేరుతో కార్యక్రమాలు నిర్వహించాలను ఉత్తర్వులు జారీ చేసింది.

# 20 సీట్లు వచ్చి ఉంటే వారు జైల్లో ఉండేవారు

(మొదటిపేజీ తరువాయి)

"కాంగ్రెస్ ఎమర్జెన్సీ ఆలోచనా ధోరణికి ఈ వ్యాఖ్యలు ఓ ఉదాహరణ. ప్రతిపక్షంలో ఉన్న నేతలను జైల్లో పెట్టాలని ఆయన అన్నారు. ఇందిరాగాంధీ ఆ పనే చేశారు. అదే తీరును కాంగ్రెస్‌ను కొనసాగించాలని అనుకుంటోంది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ నియంతృత్వ వైఖరిని అనుసరిస్తుంటే వారు మాట్లాడరు. కానీ ఇతరులను మాత్రం నియంతృత్వ పార్టీలు అంటారు" అని విమర్శించింది.

# 111 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా ముందుకు

## బఫర్, ఎఫ్‌టిఎల్‌లో ఉండే ఇళ్లు ముట్టుకోం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

ముందడుగు హైదరాబాద్:



హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడినా హైడ్రా ఇప్పటికే చెరువులను అక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చి వేసింది. అయితే పేద, మధ్య తరగతి వారు నివసిస్తున్న ఇళ్లు చెరువు బఫర్, ఎఫ్‌టిఎల్ ఉన్నా ముట్టుకోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు. ఇక చెరువు బఫర్, ఎఫ్ టీఎల్ లో నిర్మించిన వాణిజ్యం భవనాలు, నిర్మిస్తున్న ఇళ్లను మాత్రమే కూల్చి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇప్పటి వరకు హైడ్రా తీసుకున్న చర్యలను మీడియాకు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జూన్ 27 నుంచి ఇప్పటివరకూ 262 అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్లు చెప్పారు. దీంతో 111.72 ఎకరాల భూమి కబ్జాకు గురికాకుండా కాపాడినట్లు వివరించారు. మొత్తం 23 ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేసినట్లు తెలిపారు. జూన్ 27న ఫిల్మ్ నగర్ కోఆపరేటివ్ సొసైటీ, ప్లాట్ నంబర్.30 (లోటస్ పాండ్)తో మొదలైన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు దుండిగల్ మండలం మల్లంపేట్ గ్రామంలోని 13 విల్లాల కూల్చివేతల వరకు కొనసాగాయని పేర్కొన్నారు.



# 70 ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్

## దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ది

### కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

ముందడుగు జాతీయం:




దేశంలోని 70 ఏళ్లు, ఆ పైబడిన వయసు కలిగిన సీనియర్ సిటిజన్లందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. 70 ఏళ్లు, ఆపై వయస్సు కలిగిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం గొప్ప మానవతా దృక్పథంతో కూడుకున్నదన్నారు. తాజా నిర్ణయంతో దాదాపు 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు లబ్ది కలుగుతుందని.. వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యాన్ని పొందే అవకాశం దక్కుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ పథకం కింద లబ్దిదారులుగా ఉన్న కుటుంబాల్లో ఉన్న సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో రూ.5లక్షలు బీమా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఇతర బీమా పథకాల్లో చేరి ఉన్నవారు ఏదైనా (కొనసాగిస్తున్న బీమా లేదా పీఎంజేఏవై) ఎంచుకొనేందుకు వెసులుబాటు కల్పించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని 2018 సెప్టెంబర్‌లో కేంద్రం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద దేశంలోని పేద కుటుంబాల్లోని ప్రతి సభ్యునికి ఆయుష్మాన్ కార్డు అందిస్తారు. ఈ కార్డుతో ఆసుపత్రిలో చేరినప్పుడు రూ. 5లక్షల వరకు వైద్య సేవలు ఉచితం.

ముందడుగు
గురువారం, 12-09-2024, హైదరాబాద్

## రూ.1.90 లక్షలు చెల్లించి
# శిశువు కొనుగోలు
### గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఘటన



**ముందడుగు గుంటూరు:**

గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఆడ శిశువును విక్రయించిన కేసు వెలుగు చూసింది. పూర్తి వివరాల్లోకి వెళ్లితే.. జీజీహెచ్‌లో భట్టిప్రోలుకు చెందిన మీరాబి అనే మహిళ శిశువుకు జన్మనివ్వగా ఆ పసికందు మృతి చెందింది. అయితే సోమవారం మీరాబి వద్ద మరో ఆడ శిశువు ఉండటాన్ని గమనించిన జీజీహెచ్ గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ జయంతి ఉన్నతాధికారుల ద్వారా ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కొత్తపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. బాపట్ల జిల్లా చినగంజాంకు చెందిన లక్ష్మీ అనే మహిళ చీరాలలో ఆడశిశువుకు జన్మనిచ్చిందని పోలీసుల విచారణలో వెల్లడైంది. రెండు వారాల క్రితం ఆమె వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మీరాబి స్నేహితురాలు ప్రభావతి.. చిన్నగంజాంకు వెళ్లి లక్ష్మి భర్త సుబ్రమణ్యంకు రూ. 1.90లక్షలు చెల్లించి ఆ శిశువును కొనుగోలు చేసి మీరాబికి అప్పగించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. శిశువును ప్రస్తుతం ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని శిశు సంక్షేమ వసతి గృహ కేంద్రానికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

## మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొంటే
# చర్యలు తీసుకోవాలి
### హైదరాబాద్ సీపీకి లేఖ రాసిన రాజాసింగ్

**ముందడుగు హైదరాబాద్:**





హైదరాబాద్ మహానగరంలో వినాయక చవితి పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారు. ప్రతి గల్లీలో రెండు, మూడు గణనాధులను ప్రతిష్టించి పూజలు చేస్తారు. అయితే నిమజ్జనం సందర్భంగా కొంత మంది మద్యం తాగి వేడుకల్లో పాల్గొంటారు. కొందరు దేవుడిపై భక్తితో కాకుండా ఎంజాయ్ కోసం వినాయక నిమజ్జనంలో పాల్గొంటారు. ఇలాంటి వారిపైనే బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది మద్యం సేవించి వినాయక నిమజ్జనానికి వెళ్తున్నారని.. వారి చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. సీపీకి ఓ లేఖ కూడా రాశారు. గత సంవత్సరం నిమజ్జనం సందర్భంగా కొంత మంది మద్యం తాగి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారని లేఖలో పేర్కొన్నారు. కొంత మంది బుద్దిలేని వాళ్లు గణేష్ విగ్రహం వద్ద బీర్, మద్యం తాగుతూ తినిపించారని వివరించారు.

మద్యం తాగి గొడవలు కూడా పెట్టుకున్నారని.. ఇలా జరగకుండా చూడాలని సూచించారు. గతంలో కొంత మంది ట్రక్‌లపై కూర్చోని నిమజ్జనం చూడటానికి వచ్చిన మహిళపై వాటర్ ప్యాకెట్లు విసిరేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి వారి చర్యలు తీసుకోవాలని కోరారు. గణేష్ నిమజ్జనం హిందువులకు పెద్ద పండుగ అని గుర్తు చేశారు. మద్యం సేవించి గణపతి ఊరేగింపులో పాల్గొనడం తప్పని చెప్పారు. ఎవరైనా మద్యం సేవించి, ఇతరులతో అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# జూదంలో భార్యను, పిల్లలను తాకట్టు పెట్టిన భర్త
### ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ముందడుగు ఉత్తరప్రదేశ్ :**

మద్యానికి, జూదానికి బానిసైన ఓ వ్యక్తి ఏకంగా తన భార్యనే తాకట్టు పెట్టిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. వ్యక్తి తన స్నేహితులతో జూదం ఆడుతూ భార్యతో పాటు ముగ్గురు చిన్న పిల్లల్ని కూడా పందెంకాశాడు. ఆమె పట్ల దారుణంగా వ్యవహరించాడు. భార్యపై స్నేహితులు లైంగిక వేధింపులకు అనుమతినిచ్చాడు. ఆమె తన తల్లి ఇంటికి వెళ్లి రావడానికి నిరాకరించడంతో సదరు వ్యక్తి, ఆమెని కొట్టడమే కాకుండా వేలు విరిచాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



యూపీ రాంపూర్‌లోని షహబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నివసిస్తున్న మహిళకి 2013లో నిందితుడితో వివాహం జరిగింది. ఈ ఘటన తర్వాత బాధిత మహిళ తన వేధింపుల గురించి చెప్పింది. తన అత్త, భర్త కట్నం కోసం వేధించేవారని, భర్త మద్యం, జూదానికి బానిసయ్యాడని సుమారు 7 ఎకరాల భూమిని పోగొట్టుకున్నట్లు చెప్పింది. అతని స్నేహితుల వద్ద తనను కూడా పణంగా పెట్టాడని చెప్పింది. ఈ వేధింపులు భరించలేదక 112 మహిళా హెల్ప్‌లైన్‌కి ఫోన్ చేశానని, పోలీసులు రావడంతో పారిపోయాడని చెప్పింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాంపూర్ ఎస్పీ విద్యాసాగర్ మిశ్రా తెలిపారు. బాధిత మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టులో వెల్లడిస్తానని చెప్పింది.



# నేడు అన్నదాన కార్యక్రమం


**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలోని శ్రీ సిద్ధి వినాయక ఫ్యామిలీ అసోసియన్ ఆధ్వర్యంలో సనత్ నగర్, సుభాష్ నగర్ లో గురువారం సాయంత్రం 7:00గం" నుండి మహా అన్నదాన కార్యక్రమం కలదు. ప్రతి ఒక్కరూ ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించి శ్రీ గణేశ మహరాజ్ ఆశీస్సులు పొందవలసినదిగా శ్రీ సిద్ధి వినాయక ఫ్యామిలీ అసోషియన్ నిర్వాహకులు తెలిపారు.

ముందడుగు
గురువారం,
12-09-2024,
హైదరాబాద్

# యూపీలో 513 మదర్సాల గుర్తింపు రద్దు

## యోగి ప్రభుత్వం సంచలన నిర్ణయం



ముందడుగు ఉత్తరప్రదేశ్:

ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో విఫలమైన 513 మదర్సాల గుర్తింపును ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. యూపీలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లేని మదర్సాలపై సర్వేకి ఆదేశించి దాదాపు రెండేళ్ల తర్వాత, ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ మంగళవారం జరిగిన సమావేశంలో 513 మదర్సాల అనుబంధాన్ని తొలగించాలని సిఫారసు చేసింది. వీటిలో చాలా మదర్సాలు బోర్డుకు సంబంధించిన పోర్టల్‌లో వివరాలను నమోదు చేయడంతో విఫలమయ్యాయి. మిగతావి వివిధ కారణాల వల్ల డిస్‌అఫిలియేషన్‌ని కోరుకుంటున్నాయి. యూపీ వ్యాప్తంగా దాదాపుగా 25,000 మదర్సాలు ఉన్నాయి.

వీటిలో 16500 మదర్సాలు ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా ఉన్నాయి. మదర్సా బోర్డు ఛైర్మన్ ఇఫ్తికార్ అహ్మద్ జావేద్ ఈ అంశంపై మాట్లాడారు. "మంగళవారం జరిగిన సమావేశంలో మొదటి ప్రతిపాదన 2018 నుంచి 2024 వరకు మార్క్‌షీట్‌లను అప్‌లోడ్ చేయడం. పాత మార్క్ షీట్లను కూడా పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కొత్త మదర్సాల అఫిలియేషన్ ఇవ్వడంపై చర్చ జరిగింది. అఫిలియేషన్ కోసం కొత్తగా దరఖాస్తులు పోర్టల్ ద్వారా ఆమోదించబడుతాయి" అని అన్నారు.



# నాణ్యతకు భరోసా బ్రాండెడ్ టీ ప్యాకేజీలు

ముందడుగు హైదరాబాద్:

టీ కేవలం పానీయం కంటే ఎక్కువ. ఇది ఒక సాంస్కృతిక అనుభవం, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలకు ఆహ్లాదకరమైన అనుభవం మరియు పునరుజ్జీవనాన్ని అందించే ఆచారం. టీ వినియోగంలో నాణ్యత యొక్క ప్రాముఖ్యతను అతిగా చెప్పలేము, ఎందుకంటే ఇది పానీయం యొక్క రుచి, వాసన మరియు మొత్తం ఆనందాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. ఆరోగ్యం మరియు సంక్షేమం పై పెరుగుతున్న అవగాహనతో, వినియోగదారులు పరిమాణం కంటే నాణ్యతకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. బ్రాండెడ్ టీ ప్యాకేజీలను ఎంచుకోవడం అనేది నాణ్యతను నిర్ధారించడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి. హైగ్రోస్కోపిసిటీ, ఆక్సీకరణం, శోషణం, త్వరగా పాడవడం మరియు వైవిధ్యం వంటివి టీ యొక్క లక్షణాలు, కాలుష్యాన్ని నిరోధించడానికి మరియు పర్యావరణ మార్పుల వల్ల ఏర్పడే క్షీణతను తగ్గించడానికి ప్యాకేజింగ్ అవసరం. ఈ బ్రాండ్‌లు సమర్థించదగిన ఖ్యాతిని కలిగి ఉంటాయి, కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలకు కట్టుబడి ఉండేలా చేస్తాయి.

# ఎస్ఐని కారుతో ఢీకొట్టిన మహిళా కానిస్టేబుల్

## 30 మీటర్లు ఈడ్చుకెళ్లి హత్య చేసింది






ముందడుగు మధ్యప్రదేశ్:

ఓ మహిళా కానిస్టేబుల్ తన ప్రేమికుడితో కలిసి తన కారుతో సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ఢీకొట్టి, 30 మీటర్లు ఈడ్చుకెళ్లింది. జాతీయ రహదారిపై మహిళా కానిస్టేబుల్ ఈ హత్యకు పాల్పడింది. చనిపోయిన సబ్ ఇన్‌స్పెక్టర్‌ను దీపాంకర్ గౌతమ్‌గా గుర్తించారు. దీపాంకర్ రాజ్‌గఢ్ పోలీస్ లైన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ హత్యకు పాల్పడినవారు పచోర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ పల్లవి సోలంకి, ఆమె ప్రియుడు కరణ్ ఠాకూర్‌గా గుర్తించారు. ట్రయాంగిల్ ప్రేమలో మహిళా కానిస్టేబుల్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మహిళా కానిస్టేబుల్, లివ్‌ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న తన ప్రియుడితో కలిసి, ఎస్ఐ దీపాంకర్ గౌతమ్‌ను తన కారుతో ఢీకొట్టింది. అనంతరం వారిద్దరూ నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారు పచోర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ పల్లవి సోలంకికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. నేరం చేసిన తర్వాత, పల్లవి, ఆమె ప్రియుడు కరణ్ దేహత్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పల్లవి ఆమె ప్రియుడు కరణ్ మొదట ఏదో ఒక సాకుతో జాతీయ జాతీయ రహదారిపై ఎస్ఐ దీపాంకర్ గౌతమ్‌ను పిలిచారు. ఆపై అతను వెళ్ళడానికి బైక్‌పై కూర్చున్నప్పుడు, బైక్‌ను వెనుక నుండి కారుతో ఢీకొట్టారు. వారిద్దరూ దీపాంకర్ బైక్‌ను ఢీకొట్టి కారు కింద నుజ్జునుజ్జు చేసి బైక్‌తో పాటు దీపాంకర్ మృతదేహాన్ని 30 మీటర్లు ఈడ్చుకెళ్లారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో దారుణం జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ హత్య సంచలనం సృష్టించింది.

ముందడుగు
గురువారం,
12-09-2024,
హైదరాబాద్

# సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నా

ఒకప్పుడు దక్షిణాదిన కథానాయికగా రాణించిన అభిరామి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా సత్తా చాటుతున్నది. రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రంలో ఆమె కీలక పాత్రలో నటించింది. జె.శివసాయి వర్ధన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం అభిరామి పాత్రికేయులతో మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభంలో కొన్ని సినిమాలు చేసిన తర్వాత యుఎస్ వెళ్లి చదువుకున్నా. పెళ్లిచేసుకొని అక్కడే కొన్నాళ్లు సెటిట్ అయ్యాను. ఇప్పుడు ఇండస్ట్రీలో మళ్లీ బిబీగా మారడం ఆనందంగా ఉంది' అని చెప్పింది.

సినిమాలో తన పాత్ర గురించి మాట్లాడుతూ 'ఇందులో నేను గౌరి అనే బ్యాంక్ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను. మా అమ్మానాన్న కూడా బ్యాంక్ ఎంప్లాయిస్ కావడంతో పర్సనల్‌గా ఈ క్యారెక్టర్‌తో బాగా కనెక్ట్ అయ్యాను. గౌరి సింగిల్ మదర్. బలమైన ఆదర్శాలు కలిగిన మహిళగా కనిపిస్తుంది. మన ఇంట్లో తల్లి, సోదరి తరహాలో దర్శకుడు నా పాత్రను తీర్చిదిద్దాడు' అని పేర్కొంది. మహారాజ, సరిపోదా శనివారం చిత్రాల్లో తాను పోషించిన పాత్రలకు మంచి గుర్తింపు దక్కిందని, కథ..క్యారెక్టర్ నచ్చితేనే సినిమాలను అంగీకరిస్తున్నానని అభిరామి చెప్పింది. ప్రస్తుతం తమిళంలో లీడ్ రోల్స్‌లో రెండు చిత్రాల్లో నటిస్తున్నానని, తెలుగులో రెండు కథలు విన్నానని, మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ వివరాలను త్వరలో వెల్లడిస్తానని ఆమె తెలిపింది.





# అమెరికా నేపథ్య కథ

వి.ఎన్ ఆదిత్య దర్శకత్వంలో కేథరీన్ ట్రెసా కీలకపాత్రలో ఓ థ్రిల్లర్ చిత్రం రూపొందనుంది. డాక్టర్ మీనాక్షి ఈ చిత్రానికి నిర్మాత. మంగళవారం కేథరిన్ పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాక్షలు తెలుపుతూ మేకర్స్ ప్రత్యేక పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ప్రేక్షకులకు నచ్చే అంశాలతో, స్ట్రాంగ్ కంటెంట్‌తో ఈ సినిమా ఉంటుందని, ఈ సినిమా ద్వారా ఎంతోమంది దేశ, విదేశాలకు చెందిన కొత్త నటీనటులను పరిచయం చేస్తున్నామని, తెలుగు, తమిళ, కన్నడ నటీనటులతోపాటు అమెరికన్, స్పానిష్ పీపుల్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్ చెందిన ఆర్టిస్టులు కూడా ఇందులో నటిస్తారని వీఎన్ ఆదిత్య తెలిపారు. యూఎస్‌లోని డల్లాస్‌లో చిత్రీకరణ జరుపుకునే ఈ సినిమా పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామని ఆయన అన్నారు. ఈ చిత్రానికి రచన: పద్మావతి మల్లాది, సమర్పణ: ఏయు అండ్ ఐ, నిర్మాణం: ఓ.ఎం.జి.ప్రొడక్షన్స్.